






# ఇది చరిత్రను చెరిపేసే కుట్ర

వెయ్యేండ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలు కాకతీయ కీర్తి తోరణం, చార్మినార్

- అవి రాచరిక గుర్తులు కాదు, తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు
- అధికారిక చిహ్నం నుంచి వాటిని తొలగించడం సరికాదు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్రకు అవమానమే
- మండిపడుతున్న సాహితీవేత్తలు, చరిత్రకారులు
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై విమర్శలు

*చరిత్రాత్మక ఆనవాళ్లయిన కాకతీయ కీర్తి తోరణం, తెలంగాణ షాన్ అయిన చార్మినార్‌ను తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి తొలగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా నిరసన వెల్లువెత్తుతున్నది. ఇప్పుడున్న చిహ్నంలో ఎలాంటి లోపాలు లేకున్నా.. ఉద్దేశపూర్వకంగానే మారుస్తుండడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా సాహితీవేత్తలు, చరిత్రకారులు, కవులు, కళాకారులు నిరసన తెలుపుతున్నారు. మన తెలంగాణ సంస్కృతి, చరిత్రకు ప్రాధాన్యమిచ్చి కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన ఈ చిహ్నానికి ఎంతో గుర్తింపు వస్తే.. ఇప్పుడు రాజకీయ దురుద్దేశంతోనే సీఎం రేవంత్‌రెడ్డి మార్చాలనుకోవడం సరికాదని సూచిస్తున్నారు. అధికారంలో ఉన్నామని మార్చుకుంటూ పోతే తెలంగాణ చరిత్రకే మాయని మచ్చగా మిగులుతుందని చెబుతున్నారు. అవి రాచరికపు గుర్తులు కావని, వెయ్యేండ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలని, వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలని స్పష్టం చేస్తున్నారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ తొలగించడం అంటే తెలంగాణ చరిత్రను చెరివేయడమేనని మండిపడుతున్నారు.*

జగిత్యాల, మే 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రాంతాన్నంతటినీ ఏకం చేసి పరిపాలించిన కాకతీయులు.. తెలుగు జాతి వైభవాన్ని సుసంపన్నం చేశారని చరిత్రకారులు, సాహితీవేత్తలు, కళాకారులు గుర్తు చేస్తున్నారు. అజంత భాషగా ప్రఖ్యాతి గాంచిన నేటి తెలుగు భాష ఒకరకంగా పరిపూర్ణతను సాధించింది కాకతీయుల కాలంలోనేనని, తెలుగు జాతి ముఖ్యంగా తెలంగాణ జాతి ప్రజల నాగరికత, సంస్కృతీ సంప్రదాయాలను, పాలన పటిమను అజరామరం చేశారని కొనియాడుతున్నారు. ఆ నాటి పాలనా వైభవానికి, సుభిక్ష పాలనకు, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలిచిన కాకతీయుల కీర్తి తోరణం రాచరిక చిహ్నంగా కనిపిస్తుందనడంపై మండిపడుతున్నారు. తెలంగాణ ప్రజల వీరోచిత పోరాటం, దేశంలో తెలంగాణోడి ఖడ్గ చాతుర్యానికి చిహ్నంగా నిలిచిన ఈ కీర్తి తోరణాన్ని తొలగించడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన యుద్ధం విజయానికి చిహ్నమైన కీర్తి తోరణాన్ని తొలగించడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన తెలుపుతున్నారు. ఇక అధికారిక చిహ్నంలో మరో ముఖ్యమైన ముద్ర చార్మినార్‌ను సైతం తీసి వేయాలని నిర్ణయించడంపై సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు చరిత్ర, దాని ప్రాధాన్యతపై అవగాహన లేకుండా చార్మినార్‌ను ఒక మతపరమైన, రాచరిక పరమైన కట్టడంగా పేర్కొనడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

## విజయానికి సూచిక కీర్తి తోరణం

కాకతీయుల కీర్తి తోరణం చరిత్రను ఒక సారి మననం చేసుకుంటే.. రుద్రదేవుడు కాలంలో ప్రారంభమైన అనుమకొండ కోట అటు తదుపరి వచ్చిన గణపతిదేవ చక్రవర్తి, రాణి రుద్రమ, ప్రతాపరుద్రుడి కాలంలో ఏడు వరుసల్లో పూర్తి చేసుకొన్నట్లుగా చరిత్ర చెబుతున్నది. తెలంగాణ ఖడ్గ చాతుర్యానికి నిదర్శనంగా, తెలంగాణ వీరుల పౌరుషానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్నది. ప్రతాపరుద్ర చక్రవర్తి కాలంలోని సాహితీవేత్త, ప్రతాప రుద్ర యశోభూషణం రచయిత అయిన విద్యానాథుడి రచనల ప్రకారం.. క్రీ.శ 1303లో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ కాకతీయ రాజైన ప్రతాప రుద్రుడిపైకి దండయాత్రకు ఆదేశించడంతో బెంగాల్‌లో ఉన్న సైన్యాధిపతి మాలిక్ ఫక్రుద్దీన్ జూనా నేతృత్వంలో భారీ సైన్యం అనుమకొండకు బయలుదేరింది. బెంగాల్, ఒడిషా, ఆంధ్రా ప్రాంతం మీదుగా సబ్బినాడు (వరంగల్, కరీంనగర్ జిల్లాల ప్రాంతం)కు చేరుకున్నది. సబ్బినాడులోని ఉప్పరిపల్లి (ప్రస్తుతం గొడిశాలగా పిలువబడుతున్న సైదాపూర్ మండలంలోని గ్రామం) వద్ద ప్రతాపరుద్రుడి సైన్యం అల్లావుద్దీన్ ఖిల్జీ సైన్యంతో తలపడింది. ఈ యుద్ధంలో ప్రతాప రుద్రుడి సైన్యానికి రేచర్ల వెన్న వెన్నభూపాలుడి, పోతుగంటి మైలి, మంగయ్యదేవుడు నాయకత్వం వహించగా.. వీరోచిత పోరాటంతో ప్రతాప రుద్రుడి సైన్యం అల్లావుద్దీన్ ఖిల్జీ సైన్యాన్ని జయించింది. ఈ విజయానికి చిహ్నంగా అనుమకొండ కోటలో ప్రతాప రుద్రుడు కీర్తి తోరణాలను వేయించినట్లుగా తెలుస్తున్నది. అయితే అప్పుడే గొడిశాల గ్రామ సమీపంలో ఒక తోరణాన్ని నిర్మించారని చరిత్రకారుల ద్వారా తెలుస్తున్నది.

## మార్చడం సరైంది కాదు

ఏ రాష్ట్ర చిహ్నంలోనైనా, దేశ చిహ్నంలోనైనా చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం ఉంటుంది. దానిని మనం గౌరవించాలి. ఇప్పుడున్న రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు చేయడం సరికాదు. కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలగించాలని నిర్ణయించడం ఏ మాత్రం సరైంది కాదు. ప్రస్తుత చిహ్నం ఒక మతానికి, ఒక కులానికి, వర్గానికి సంబంధం లేకుండా ఉన్నది. అందులో నాకు తెలిసి ఎలాంటి లోపాలు లేవు. ఇలాంటి చిహ్నాన్ని మార్చాలనుకోవడమే లక్ష్యమైతే మార్చడం తప్పని నేను భావిస్తున్న. రాష్ట్ర గీతాన్ని తెలంగాణ భావాలకు, సంస్కృతికి సంబంధం లేని వ్యక్తి కీరవాణితో కంపోజ్ చేయించడంపై నేను తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్న.

**- వారాల ఆనంద్, ప్రముఖ కవి, రచయిత**

## ప్రకృతి విలయంపై విజయ చిహ్నం

చార్మినార్ చరిత్రను చూస్తే.. గోల్కొండ సుల్తాన్‌ల అత్యంత ప్రాశస్త్యమైన నిర్మాణం. దీనిని మహ్మద్ కులీ కుతుబ్‌షా 1591లో ప్రారంభించి 1592లో పూర్తి చేశాడు. కొత్తగా హైదరాబాద్ నగర నిర్మాణం ప్రారంభమైన తర్వాత దానికి మధ్యస్తంగా దీనిని నిర్మించాడు. మహ్మద్ కులీ కుతుబ్‌షా పాలన చేస్తున్న 1588–90 మధ్య కాలంలో గోల్కొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో కలరా, ప్లేగు ప్రబలి అనేక మంది చనిపోయారు. అనేక చర్యల ఫలితంగా ఆ అంటువ్యాధులను అరికట్టారు. అందుకు చిహ్నంగా చార్మినార్ నిర్మాణం చేపట్టారు. ఈ బాధ్యతలు ఇరాన్ దేశానికి చెందిన మీర్ మొహ్మద్ మోమిన్‌కు అప్పగించారు. ఆయన ఇండో–ఇస్లామిక్–పర్షియన్ వాస్తుశాస్త్రాలను రంగరించి నాలుగు కమాన్లు, నాలుగువైపుల తోవలతో చార్మినార్ నిర్మించారు. దీని నుంచి వెళ్లే నాలుగుదారులు నాలుగు ప్రాంతాలకు చిహ్నం కాగా.. వీటి అర్థం గోల్కొండ, హైదరాబాద్ నాలుగు ప్రాంతాల వ్యాపారాల కూడలి అని!



ఉప్పరపల్లి ముఖద్వారం (ఫైల్)

## తొందరపాటు పనికిరాదు



అధికారంలోకి వచ్చిన పార్టీలు చారిత్రక చిహ్నాలను మార్చి ప్రజలపై రుద్దడం కరెక్ట్ కాదు. తెలంగాణ ఆవిర్భవించి పదేండ్లయింది. తొలిసారి అధికారం చేపట్టిన కేసీఆర్ సర్కారు అత్యంత విశిష్టమైన కాకతీయ చక్రవర్తుల తోరణం, విశ్వఖ్యాతి గాంచిన చార్మినార్, అశోకుడి చక్రంతో మన సంస్కృతి ప్రతిబింబించేలా తెలంగాణ చిహ్నాన్ని రూపొందించింది. ఈ లోగోను అన్ని వర్గాలు ఆమోదించాయి. ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత కాకతీయ తోరణం, చార్మినార్ రాచరిక పోకడలకు అద్దంపట్టే గుర్తులని భావించి గుడ్డిగా మార్చాలని నిర్ణయించడం విడ్డూరం. ఏ దేశ చిహ్నాలైనా గత పాలకుల గొప్పదనాన్ని సూచించేవే. కేవలం తమ గొప్పతనం కోసం గత ప్రభుత్వ ఆనవాళ్లను చెరిపేసేందుకు సంకుచితత్వంతో తీసుకున్న నిర్ణయం. సీఎం రేవంత్‌రెడ్డికి తొందరపాటు పనికిరాదు. కేవలం నలుగురైదురి సూచన మేరకు ఇలాంటి నిర్ణయం చేయడం భావ్యంకాదు. మేధావులు, చరిత్రకారులు, సాహితీవేత్తలతో చర్చించి పునరాలోచించాలి.

**- ద్యావరశెట్టి జనార్దన్, జిల్లా తెలంగాణ రచయితల వేదిక, పూర్వ అధ్యక్షుడు**

# సంచలనం రేపిన 'షాడో ఎమ్మెల్యే' కథనం

- 'నమస్తే కథనం'పై మానకొండూర్ నియోజకవర్గంలో చర్చ
- సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్
- కాంగ్రెస్ శ్రేణుల్లో కలకలం
- ఉలిక్కిపడ్డ సదరు పీఏ
- ఇసుక ట్రాక్టర్ ఓనర్ల నుంచి వసూలు చేసిన పైసల్ వాపస్
- తమకూ ఇవ్వాలని రేణికుంట ట్రాక్టర్ యజమానుల డిమాండ్
- ఎటువంటి ప్రకటన జారీ చేయని ఎమ్మెల్యే




కరీంనగర్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'మానకొండూర్ ఎమ్మెల్యే అసలు పీఏను నేనే' అంటూ ఓ వ్యక్తి చెలామణి అవుతూ.. వివిధ వర్గాల నుంచి వసూళ్లకు దిగుతూ.. దందాలు నడిపిస్తున్న తీరుపై బుధవారం 'నమస్తే తెలంగాణ'లో 'షాడో ఎమ్మెల్యే' శీర్షికన ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. నియోజకవర్గంలో ప్రకంపనలు రేపింది. సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతోపాటు ప్రతి చోటా ఆ 'షాడో ఎమ్మెల్యే'పై చర్చ జరిగింది. ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లోనూ అంతర్గతంగా చర్చ సాగింది. 'నమస్తే తెలంగాణ' వాస్తవాలను బయట పెట్టిందని, సదరు పీఏ అక్రమాలు మరిన్ని ఉన్నాయంటూ కొంతమంది 'నమస్తే'కు ఫోన్ చేశారు. సదరు పీఏ ఏయే వర్గాల నుంచి ఎలా వసూలు చేస్తున్నారో వివరిస్తూ 'నమస్తే తెలంగాణ' కండ్లకు కట్టినట్టుగా కథనం ప్రచురించింది. తిమ్మాపూర్ మండలం మోయతుమ్మెద వాగు నుంచి కొత్తపల్లి, రేణిగుంట పరిధిలో నుంచి కొంతమంది ఇసుకను తీసుకొని విక్రయిస్తుండగా.. ఒక్కో ట్రాక్టర్ నుంచి నెలకు రూ.పదివేలు ఇవ్వాలంటూ వసూళ్లకు పాల్పడిన విషయాన్ని బహిర్గతం చేసింది. దీంతో ఉలిక్కిపడ్డ సదరు పీఏ.. ఈ మరకలు తుడిచి వేసుకునేందుకు కొత్తపల్లికి చెందిన కొంతమంది ట్రాక్టర్ యజమానుల నుంచి వసూలు చేసిన డబ్బులను బుధవారం వాపస్ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. దాదాపు ఎనిమిది మంది ట్రాక్టర్ల ఓనర్లకు పైసలు వాపస్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న రేణిగుంట ట్రాక్టర్ యజమానులు కూడా తమ వద్ద వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు సమాచారం. కాగా, ఎమ్మెల్యే పేరు చెబుతూ సదరు పీఏ బాహాటంగానే వసూళ్లకు పాల్పడుతున్నాడని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఏమైనా స్పందిస్తారేమోనని అందరూ భావించారు. కానీ, ఈ విషయంలో ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి ఎటువంటి ప్రకటన వెలువడకపోవడం గమనార్హం. దీనిపైనా ప్రస్తుతం నియోజకవర్గంలో భిన్న రకాల చర్చలు జరుగుతున్నాయి.

# 'పద్మ' పురస్కారాలకు ఆహ్వానం

పెద్దపల్లి జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఏ సురేశ్

పెద్దపల్లిరూరల్, మే 29: సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేసిన వారి నుంచి పద్మ పురస్కారాలకు జిల్లా యువజన క్రీడల శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని పెద్దపల్లి జిల్లా అధికారి అక్కపాక సురేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ట్, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ప్రజా వ్యవహారాలు, పౌర సేవలు, వాణిజ్య పరిశ్రమలతోపాటు తదితర విభాగాల్లో చేసిన కృషిని, సాధించి లక్ష్యాలను 800పదాలకు మించకుండా వెబ్‌సైట్ (https//padmaawards.gov.in) దరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు ఫారాన్ని జూన్3లోగా కలెక్టరేట్ కలెక్టరేట్‌లోని 225 నంబర్‌లో గల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.




జీలుగ విత్తనాల కోసం తీగలగుట్టపల్లి డీసీఎంఎస్ కేంద్రం వద్ద రైతుల బారులు

# పచ్చిరొట్ట కోసం పరేషాన్

- అసలే ఆలస్యం.. ఆపై సగమే వచ్చిన విత్తనాలు
- సెంటర్ల వద్ద రైతుల బారులు
- అయినా సరిగ్గా అందక నిరాశ
- పూర్తి స్థాయిలో వస్తాయో..? లేదా..? అనే అనుమానాలు

*పచ్చిరొట్ట ఎరువుగా ఎంతో ఉపయోగపడుతుంది. రసాయనిక ఎరువుల వాడకాన్ని కూడా తగ్గిస్తుంది. అందుకే వరి సాగుకు ముందు ఈ విత్తనాలను దుక్కుల్లో చల్లుకుంటారు. అయితే ఈ సారి ఈ విత్తనాలు ఆలస్యంగా రావడం, అనుకున్న మేర రాకపోవడంతో రైతులు ఆగమవుతున్నారు. గతంలో మే మొదటి వారంలోనే వ్యవసాయశాఖ పంపిణీ చేసినా.. ఈ సారి నెలాఖరు వరకు కూడా సరిగా ఇవ్వకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. ఎక్కడ పంపిణీ చేస్తున్నారని తెలిసినా కేంద్రాల వద్ద ఎగబడుతున్నారు. అయినా అందకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.*

కరీంనగర్, మే 29 (నమస్తే తెలంగాణ) : వరి సాగుకు ముందు పచ్చిరొట్టను ఎరువు కింద సాగు చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని రైతాంగం భావిస్తున్నది. అందుకే ప్రతి సీజన్‌లోనూ పచ్చిరొట్ట సాగు చేసే వారి సంఖ్య పెరుగుతున్నది. డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సీజన్‌లోనే చుక్కలు చూపుతున్నది. గతేడాది అమ్మకాలను చూసి ఈ యేడాది అవసరాన్ని అధికారులు అంచనా వేస్తారు. అయితే ఈ సారి కరీంనగర్ జిల్లాలో 7 వేల క్వింటాళ్లకు ఇండెంట్ ఇచ్చారు. పరిస్థితిని బట్టి చూస్తే అంతకు మించిన డిమాండ్ ఉండే అవకాశం కనిపిస్తుండగా, అయితే కనీసం ఇండెంట్ ఇచ్చిన వరకైనా పచ్చిరొట్ట విత్తనాలు తెప్పిస్తారా..? అనే సందేహాన్ని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎక్కువగా పచ్చిరొట్ట సీడ్స్ ఉత్పత్తి జరుగుతున్నది. ఈ సారి ఇక్కడి నుంచి ఎక్కువ మొత్తంలో సీడ్ దిగుమతి కానట్టు తెలుస్తున్నది.

## ఎక్కడ చూసినా బారులు

పోయిన వానకాలం సీజన్‌లో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 33,245 ఎకరాల్లో 3,989 క్వింటాళ్ల జీలుగ, 523 ఎకరాల్లో 78 క్వింటాళ్ల జనుము కలిపి మొత్తం 33,768 ఎకరాల్లో పచ్చిరొట్ట సాగు చేశారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ సారి విత్తన ప్రణాళికలో 6,800 క్వింటాళ్ల జీలుగ, 200 క్వింటాళ్ల జనుము విత్తనాలను ప్రతిపాదించారు. అయితే ఇప్పటి వరకు జిల్లాకు కేవలం 2,500 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల జనుము మాత్రమే వచ్చింది. ఈ వచ్చిన కొద్ది విత్తనాలను ఎంపిక చేసిన 62 డీసీఎంఎస్ కేంద్రాలు, సింగిల్ విండో కార్యాలయాలు, ఆగ్రో సెంటర్లలో బుధవారం పంపిణీకి సిద్ధంగా ఉంచారు. 60 శాతం రాయితీపై ఇస్తున్న ఈ విత్తనాల కోసం సంబంధిత ఏఈవోలు పర్మిట్ రాయాల్సి ఉంటుంది. అందుకోసం రైతులు పాసు పుస్తకాలతో ఇటు వ్యవసాయ అధికారుల కార్యాలయాలకు అక్కడి నుంచి ఆగ్రోస్ సెంటర్లకు పరుగులు పెట్టే పరిస్థితి వచ్చింది. బుధవారం దాదాపు అన్ని మండల్లాలోని పంపిణీ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరి కనిపించారు. అయితే కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లి డీసీఎంఎస్ కేంద్రానికి వచ్చిన సుమారు 40 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు రెండు మూడు గంటల్లోనే పూర్తి కావడంతో చాలా మంది నిరాశగా వెనుదిరిగారు. సరిపడా విత్తనాలు అందుబాటులో లేక పోవడంతో ఇటు అధికారులు, అటు పంపిణీ కేంద్రం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 2,500 క్వింటాళ్ల వరకు జీలుగ విత్తనాలు తెప్పిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇవి కూడా సరిపోవని, ఇండెంట్ ఇచ్చిన వరకైనా పచ్చిరొట్ట విత్తనాలు తెప్పించాలని రైతులు కోరుతున్నారు.

## మరిన్ని విత్తనాలు తెప్పిస్తున్నాం

కరీంనగర్ జిల్లాకు అవసరమైన మరిన్ని పచ్చిరొట్ట విత్తనాలు తెప్పిస్తున్నాం. ఇప్పటి వరకు 2,500 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల జనుము విత్తనాలు తెప్పించాం. 62 కేంద్రాల్లో పొజిషన్ చేశాం. మరో 2,500 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రెండు మూడు రోజుల్లో తెప్పిస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పంపిణీ చేస్తాం. పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

**- శ్రీనివాస్, డీఏవో (కరీంనగర్)**

# 'భారీ భూభాగోతం'పై ఎస్‌బీ విచారణ

- జగిత్యాల బల్దియాలో ఎంక్వాయిరీ
- కలెక్టర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ విజ్ఞప్తి
- మున్సిపాలిటీలో అక్రమాలపై చర్చ



విచారణ చేస్తున్న ఎస్‌బీ అధికారులు

జగిత్యాల అర్బన్, మే 29: 'జగిత్యాల మున్సిపాలిటీలో భారీ భూ భాగోతం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టిస్తున్నది. కలెక్టర్, అదనపు కలెక్టర్లు మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఇటు బాధితుల ఫిర్యాదుతో జిల్లా పోలీస్ అధికారులు చర్యలు సిద్ధమయ్యారు. భూ కబ్జాకు యత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఏకంగా స్పెషల్ బ్రాంచ్ అధికారులు రంగంలోకి దిగారు. మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగంలో విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. పట్టణ పోలీసులు కూడా వ్యవహారంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కాగా, భూకబ్జా యత్నం, అసెస్‌మెంట్ కాపీ తయారీపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కలెక్టర్ యాస్మిన్ భాషాను బుధవారం రాత్రి కలిసి వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ సిబ్బంది, అధికారుల ప్రమేయం ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూభాగోతం కథనంతో మున్సిపాలిటీలో గతంలో జరిగిన అవకతవకలపై సైతం చర్యలు మొదలు కావడంతో అక్రమార్కుల్లో వణుకు పుడుతున్నది. పలువురు బాధితులు తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలంటూ అధికారులను ఆశ్రయించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

# కుక్కను తప్పించబోయి.. మృత్యుఒడికి

- అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టిన బైక్
- ఇద్దరు యువకుల మృతి

రాంనగర్ మే 29: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి స్తంభాన్ని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడి ఆ ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి భానుప్రకాశ్‌రెడ్డి(20) మంగళవారం రాత్రి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో తన మిత్రులైన రిత్విన్ (19), ఆదిత్య, సిద్ధార్థను కలిసేందుకు వెళ్లాడు. ఈ సందర్భంగా భానుప్రకాశ్‌రెడ్డి, రిత్విన్ ఒక బైక్‌పై.. ఆదిత్య, సిద్ధార్థ మరో బైక్‌పై బయటికి వెళ్తున్నారు. భాగ్యనగర్ సమీపానికి చేరుకునేసరికి కుక్క అడ్డు రావడంతో భానుప్రకాశ్‌రెడ్డి, రిత్విన్ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భానుప్రకాశ్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రిత్విన్‌ను చికిత్స కోసం దవాఖానకు తరలించగా, బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతిచెందాడు. భానుప్రకాశ్‌రెడ్డి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571